

వల్లిశెట్టి రామారావు

# గూటిలో గువ్వలు

వలికాలం. మంచుపొగ దట్టంగా పట్టివుంది. అప్పుడే వుదయించే సూర్యుడు ఆ పొగమంచు లోంచి పొడుచుకొస్తున్నట్లుగా కనిపిస్తున్నాడు.

పెరట్లోకి వచ్చి చూశాను. ఎదురుగా వేపచెట్టు తొర్ర కనిపించింది. ఆ తొర్రలో నీరెండ పడ్డచోట మగ గువ్వ రెక్కలు ముడుచు క్కూర్చుంది లోపలనుంచి ఆడగువ్వ వచ్చిన జాడ కనబడలేదు. అదింకా తొర్రలోనే వుంది.

పక్కింటి పైడమ్మ గొంతు కర్ణ కఠోరంగా వినబడుతోంది. ఈ పైడమ్మకి తెల్లారితే పరగడుపు కాబోలు. పరగడుపునే మొగుడిపై తిట్లకి లంకించుకుంది.

''ఏవమ్మో! పైడమ్మా! ఈ రోజుకి నీ రేడియో కాస్త ఆపేస్తావా? శుభమా అని ఇంటిలో దిగుతున్నాం. చుట్టాలూ—పక్కాలూ అంతా వచ్చివున్నారు. అందరూ వింటే నవ్వుతారు. కాస్త రభస చేయకుండా వుండవమ్మా తల్లీ!'' కొత్తగా ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేసుకుంటున్న రామంగారు వార్నింగిచ్చారు.

''ఇది నా యిల్లు. నా యింట్లో లక్షా తొంభై అనుకుంటాను, కాదంటానికి నీకేం అధికారం వుందయ్యా!'' ఆ మాటలు ఆయన చెవిలో పడ్డాయో లేదోగాని, నా చెవిని మాత్రం పడ్డాయి.

''అలా పేలే లంజఖానా! మొన్న జబ్బ విరగ్గొట్టి హాస్పటల్‌కి పంపించానుగాని, ఈసారి తలకాయ బద్దలుగొట్టి నేనే నేరుగా జైలు కెళ్లిపోతాను. దాంతో ఈ యింటి పీడా పోతది.'' ఇంటి వసారాలో పడుతున్న ఎండపొడలో చుట్ట కాల్చుకుంటూ అంటున్నాడు డాక్టరు.

చెప్పడం మరిచాను. ఆయన డాక్టరంటే పట్టా పుచ్చుకుని ప్రాక్టీసు పెట్టిన డాక్టరు కాదు. ఆయన అసలు పేరేమిటో ఎవరికీ సరిగ్గా తెలీదు. అప్పుడప్పుడూ నాటు వైద్యం చేస్తుంటాడు. అందుకు అందరూ డాక్టరుగారని పిలుస్తారు. బుర్రలో పురుగు సరిగ్గా వుంటే పైడమ్మ కూడా అంటుంది. ''మా డాక్టరంటే ఏమిటనుకున్నారూ...'' అని.

వీళ్ళిద్దరి కాంబినేషన్ చూస్తుంటే అప్పుడప్పుడూ—నాకొక సినిమా పాట గుర్తుకొస్తుంటుంది. అదేమిటంటే :

''ఏడూ కొండలవాడా! వెంకటేశా! అయ్యో ఎంత పనీ చేశావు తిరుమలేశా! చెట్టుమీది కాయనూ, సముద్రంలో వుప్పునూ, కలిపినట్టే కలిపావూ శ్రీనివాసా!...''

* * *

పైడమ్మ, డాక్టరు పెళ్ళి చేసుకున్న దంపతులు కాదు. పెళ్లి మొగుడికి విషం పెట్టి డాక్టరుతో లేచివచ్చేసిందని పైడమ్మని అంటుంటారు. ఏది ఏమైనా లోగుట్టు పెరుమాళ్ళ కెరుక. డాక్టరుకి పైడమ్మకి మధ్య వయోభేదం చాలా వుంటుంది. పైడమ్మలో యవ్వనపు బిగువు ఇంకా తగ్గిపోలేదు. పైగ సినిమాలో సైడ్ హీరోయిన్‌లా వుంటుంది. ఆమె నోరు మాత్రం బావుండదు. డాక్టరు అరవై యేళ్ళు పైబడ్డ వ్యక్తి. నల్లగా నాపరాయిలా వుంటాడు. బట్టతల, వరిబీజం. ఇటువంటాయనలో ఆమె ఏమి చూసి వరించి వచ్చిందో...

మొదట్లో అందరూ అనుకుంటుంటే విన్నాను. డాక్టరు బంగారం తయారు చేస్తాడని, మూఢ ప్రజలూ—మూఢ నమ్మకాలూను. నేను యిప్పటికీ నమ్మలేదు... వేమన అంతటివాడే ఒకరు బంగారం కోరితే మట్టికుండను చేసిచ్చి బజారులో అమ్మకో బంగారం అవుతుందన్నాడట.

మొదట్లో ఏణ్ణర్ధంపాటు వారి దాంపత్య జీవితం బాగానే సాగింది. ఆ వీధిలో కారుచౌకగా ఒక ప్లాటు కొనుక్కుని పెంకుటిల్లు కట్టించుకున్నారు. మొగుడి దగ్గరనుంచి తెచ్చుకున్న నగలు పెట్టుకుని అప్పుడప్పుడూ పైడమ్మ పెళ్లి కూతురులా తిరిగేది. కొంత కాలం గడిచేసరికి ఎందుకో ఆమెలో జుగుప్స, నిరాశ ఏర్పడ్డాయి. ఒంటిమీది నగలు ఒక్కొక్కటి తాకట్టులోని కెళ్ళడం మొదలెట్టాయి.

ఇంతకుముందు నూనె — తెలగపిండి అమ్మడంలో పైడమ్మదే పైచేయి అని ప్రతీతి. పైడమ్మ నెత్తికి మళ్లీ గంపొచ్చింది. ఈసారి వ్యాపారం బాగానే చేసి లాభాలు గుంజసాగింది. డాక్టరు చేసే పనిలేక పల్లెలంటకి వెళ్లి నువ్వులు ఖరీదు చేసేవాడు. ఇంటి పనీ — వంట పనీ కూడా ఆయనదే.

పైడమ్మ కష్టపడి సంపాదిస్తుంటే, డాక్టరు కూర్చుని ఒళ్ళు కందకుండా తింటున్నాడని కొందరు కిట్టనివాళ్ళు కడుపొంగు తీరక అనేవాళ్ళు. జనవాక్యం నిజమన్నట్టుగా నె వాళ్ళిద్దరూ సరిపంక్తిని కూర్చుని సుష్టుగా భోంచేసేవారు. పిల్లా—పీచు లేనివారు. వాళ్ళ అనురాగం ఆనందం చూస్తుంటే నాకు వేపచెట్టు తొర్రలోని గువ్వల జంట గుర్తుకొచ్చేది. అం తంతే. మూడు సంధ్యలూ కులుకుతూ, కేరుతూ

ఒకధాన్నొకట ముక్కుతో పొడుచుకుంటూ — ఆహారాన్ని తెచ్చుకుని పంచుకుతింటూ దర్శన మిచ్చేవి. రోజూ ఆ గువ్వల్ని స్టడీ చేయడం నాకొక అలవాటైపోయింది. రోజులు దొర్లుతున్నాయి.

* * *

డబ్బు పాపిష్టిది. అది మనిషిని కోతిలా చిందులు వేయిస్తుంది. వ్యాపారం మీద వచ్చిన డబ్బుతో వడ్డీ వ్యాపారం మొదలెట్టింది పైడమ్మ. డాక్టరు పద్దులూ — పత్రాల గొడవ చూసుకునే వాడు. తాకట్లు, బాపతులూ — నోటు బాపతులు వచ్చినప్పుడల్లా నా దగ్గరికి వచ్చి రాయించుకునే వాడు డాక్టరు. అప్పుడప్పుడూ సాక్షి సంతకాలు నావే పడేవి. పైడమ్మ నూనె గానుగ పిండి కాస్త అగలాగ యిస్తూ నా భార్యను మచ్చిక చేసుకుంది. మొగుడికి తెలియకుండా యితరులకిచ్చే డబ్బు, దస్కం తాలూకు చిట్టాలు నా భార్యచేత రాయించుకునేది. వడ్డీలు లెక్క కట్టించుకునేది. నేను చూసీ చూడనట్లుగా వుండేవాణ్ణి.

డబ్బు విషయంలో పైడమ్మకి — డాక్టరుకీ మనస్పర్థలొచ్చాయి. ఒకరిమీద ఒకరికి అనుమానం పెరిగింది. పెట్టెలో పెట్టిన డబ్బు కనిపించలేదని డాక్టర్ని పైడమ్మ వీధిన పెట్టేది. మాటా — మాటా పెరిగి యిద్దరూ కొట్టుకునేవారు, తిట్టుకునేవారు. కొట్లాటలో పైడమ్మ దే పైచేయి. మీది మీదికొచ్చి డాక్టరు క్రాపింగ్ (అఫ్‌కోర్సు పుంజాడు వెంట్రుకలే ననుకోండి) పట్టుకునేది.

ఇంచుమించు డబ్బూ — దస్కమంతా పైడమ్మ హేండ్ ఓవర్‌లోనే వుండేది ఇల్లు మాత్రం డాక్టరు పేరున వుంది. ఆ యిల్లుకూడా తన పేరునే పెట్టమని గొడవపెట్టేది. అదంతా తన కష్టార్జితమే. డాక్టరుకి నయాపైసా సంపాదించడం రాదనేది. అదీ ఒక విధంగా నిజమే. డాక్టరు బంగారం సింగారం చేయడం అంతా వట్టిది.

ఎన్ని స్పర్థలున్నా, ఎంత కాదనుకున్నా. విభిన్న మనస్తత్వాల్ని ఒక గూటి కిందకు చేర్చేది జీవితం. అది మానవుల అభిమతం కాకపోయినా అవసరం. అందుకే ఎంత కొట్టుకున్నా ఎంత తిట్టుకున్నా వాళ్ళిద్దరి మాట ఒక్కటే. డాక్టరు వేదాంతధోరణి మనిషి. అందుకే తెగేవరకూ లాగేవాడు కాదు. పైడమ్మ వేడిమీద ఎంత నోరు పారేసుకుంటున్నా తను మాత్రం చెవి పారేసేవాడు కాదు. భిన్నత్వంలో ఏకత్వం అంటే వారిదే.

సహనానికి కూడా ఒక హద్దుంటుందేమో ? ఒక రోజున పెట్లో పెట్టిన రెండొందలు కనిపించ లేదని కిందా — మీదా డాక్టర్ని తిట్టుకుంటుంది పైడమ్మ.

"చిల్లర బాకీలకు ఓ నూటయాభై జమ చేసి, మిగతా యాభై పెట్టి పంచెలసాపు, లాల్చీలు తీసుకున్నాను. ఎందుకలా వురోసుకు చస్తావు" అన్నాడు డాక్టరు.

"నాతో చెప్పకుండా ఎందుకు పెట్లో డబ్బు బాబు కష్టపడిందనుకున్నావా ? నీ ఇష్టానారంగా ఖర్చు పెట్టుకొడానికి" చిందులు వేసింది పైడమ్మ.

"అబ్బా ! వూరుకోవే ! నీచేత్తో నువ్వు బాకీలు తీర్చవు. బట్టలు కొనవు. వున్న రెండు జతలూ చిరిగిపోయినయ్. అందుకే డబ్బు వాడేసేను." సర్ది చెప్పాడు డాక్టరు.

అయినా పైడమ్మ వూరుకోలేదు. సరికదా పుడుక్కుంది. యిద్దరి మధ్యా వాదన పెరిగింది. పైడమ్మ కర్ర తీసుకుని డాక్టర్ని కొట్టింది. డాక్టరు మొదట సహించి వూరుకున్నాడు. పైడమ్మ కోపం చల్లారలేదు. మళ్ళీ రెచ్చిపోయి వచ్చి కర్రెత్తింది. ఆడదానికే అంత పౌరుషం వుంటే మగాడికి మాత్రం వుండదూ ! పైడమ్మ చేతిలోని కర్ర లాక్కొని నెత్తిమీద బలంగా బాదాడు డాక్టరు. ఆ దెబ్బతో మొదలు నరికిన మానులా పైడమ్మ నేలమీద పడిపోయింది. తల కాయ పగిలి నెత్తురు ఏకధారగా కారసాగింది. స్పృహ తప్పింది.

డాక్టరుకి కంగారు పుట్టుకొచ్చింది. ఆ వీధి లోని జనం చుట్టూ మూగారు. తలకొకరు డాక్టర్ని దుయ్యబట్టారు. ఆయన వాళ్ళ మాటలు ఖాతరు చేయలేదు. నలుగుర్ని సాయం పట్టమని పైడమ్మని సావిట్లో వేశాడు. నెత్తురు తుడిచి ఏదో మందువేసి కట్టు కట్టాడు. అయినా నెత్తురు కట్టడలేదు. రిక్షా పిలిపించి పైడమ్మని హాస్పిటల్లో చేర్చాడు. గవర్నమెంటు డాక్టరు కుట్లు కుట్టి — కట్టు కట్టి ఇంజక్షను నిచ్చాడు వెంటనే. అప్పటికి డాక్టరు మనసు స్థిమితి పడింది. నన్ను చూసి గండం గడిచిందండి ప్రసాదు బాబు అన్నాడు.

వారం రోజులు పైడమ్మ హాస్పిటల్‌లోనే వుంది. మూడు పూటలా కాఫీలు, భోజనాలు పట్టుకెళ్ళి అందించేవాడు డాక్టరు.

పైడమ్మను కొట్టినందుకు తర్వాత చాలా బాధ పడ్డాడు డాక్టరు.

"పైడమ్మని చేతులారా చంపేసుకుందును— ఏ దేవుడు రక్షించాడోగాని, పైడమ్మ ప్రాణాలు దక్కినయ్. ఇంకెప్పుడూ దాని ఒంటిమీద చెయ్యి చేసుకోను" రెండ్రోజులకి పైడమ్మని డిశ్చార్జి చేస్తారనగా అన్నాడు డాక్టరు.

గడచిన కాలంలో పైడమ్మని విడిచిపెట్టి క్షణం వుండలేదాయన. ఆ కాస్త వియోగానికి కొండంత బాధ పడ్డాడు. నిద్రా హారాలు మాని మనిషి చిక్కిపోయాడు.

"పైడమ్మను కొట్టి యిప్పుడెందుకు బాధ పడుతున్నారు. ఆ మనిషికి తగిన శాస్తి చేశారు కదా" అన్నాను.

"అలా అనకండి ప్రసాదుబాబూ ! అదంటే నాకు పంచ ప్రాణాలు. పైడమ్మ చాలా మంచిదే నండీ ! ఎవరో గిట్టనివాళ్ళు మప్పుతున్నారు. దాంతో దాని బుద్ధి మారిపోతోంది. అది ఫలానా వాడితో చీకట్లో మాట్లాడుతుందని, ఫలానా మనిషికి డబ్బు పెడుతుందని... ఇలా... ఎందరో ఎన్నో చెప్పి చూశారు. అయినా నేను ఖాతరు చేయలేదు ఎవరి మాటా. వాళ్ళు చెప్పింది నిజమే. అందుకు చూసి చూడనట్లు వూరుకుంటు వచ్చాను. నాకెవరున్నారు. దాని ఆనందానికి నేను అడ్డు రాలేదు. అయినా అది కలుపుకుపోలే పోతుంది. మాటాడితే యిదంతా తనే గడిం పెట్టిందట. నేను పొదుపుచేసి అమర్చిపెట్టబట్టే కదా అది వీధిలో అమ్ముకు రాగలుగుతుంది వచ్చిందానికే కష్టమూ తెలియకుండా వండి పెడుతున్నాను. నాలో జవ తగ్గిపోతోంది. బతి నన్నాళ్ళు ఏదో గుట్టుగా యీ ఘటం దాని చేతులమీదగా వెళ్ళిపోవాలని నా కోరిక" అంటూ కంటతడి పెట్టుకున్నాడు.

అతని గుండెల్లో గూడుకట్టుకున్న బాధను నేనర్థం చేసుకోగలిగాను. పైడమ్మే అర్థం చేసుకోలేక పోయింది. డాక్టరు సర్టిఫికేటు తీసుకుని పోలీసు రిపోర్టు యిచ్చింది.

పోలీసులొచ్చి డాక్టర్ని పిలుచుకెళ్ళారు. ఆ క్షణంలో నేనుండబట్టి, నేనూ డాక్టరు వెనుక వెళ్ళాను. పోలీసు స్టేషన్‌లో పైడమ్మ కూర్చుని వుంది. యస్సైతో ఏవో చెపుతోంది.

సబ్-ఇన్‌స్పెక్టరు డాక్టర్ని చాలా ప్రశ్నలు వేశాడు. అన్నింటికీ ఆయన సమాధానం చెప్ప కొచ్చాడు.

పోలీసువాళ్ళ పర్మిషన్ తీసుకుని పైడమ్మని పక్కకి తీసుకెళ్ళాను.

"ఎందుకొచ్చిన గొడవ. కోర్టులంట తిరగడ మంటే మాటలుకాదు. అనవసరంగా ప్లీడర్ని మేపడమెందుకు. పోలీసోళ్ళు యిప్పటికి తిన్నది చాలు. రాజీపడిపో. డాక్టరుచేత యికముందు యిలా జరక్కుండా వూచీ రాయించి యిస్తాను కావలిస్తే" అన్నాను.

పైడమ్మ ఏ కళనుందో ఒప్పుకుంది.

ఇటుపై ఎప్పుడూ పైడమ్మమీద ఎటువంటి అఘాయిత్యం జరిగినా అందుకు డాక్టరే బాధ్యుడు అనే సారాంశం గల రిపోర్టుమీద డాక్టరు సంతకం పెట్టాడు.

ఆనాటినుండి డాక్టరు జీవచ్ఛవం అయి పోయాడు. వంక దొరికిందని పైడమ్మ మరీ అలుసుగా చూడసాగింది. ఎన్ని దొంకతిరుగుళ్ళు తిరిగినా డాక్టరు కిమ్మనకుండా పడివున్నాడు.

* * *

ఆ రోజు తెల్లవారుజామున డాక్టరొచ్చి తలుపు తట్టాడు. పైడమ్మ ఎవడితోనో డబ్బు, దస్కం పట్టుకు లేచిపోయిందని నెత్తి నోరు బాదుకున్నాడు. అంతా అయిపోయిం తర్వాత యింక చేసేదేముంది. ఏవో రెండు వుపశమనం మాటలు చెప్పి ఆయన్ని వోదార్చి పంపేశాను. ఆ మాట విని నా భార్య బుగ్గమీద వేసేసుకుంది.

పెరట్లోకి వచ్చి చూశాను. గువ్వల జంట దర్శనమిచ్చాయి. మనుషులకంటే పక్షులే నయ మనిపించింది. ఆ గువ్వలు ఎంత దెబ్బలాడు కుంటున్నా ఒకే గూటిలో కలిసి మెలిసి వుంటు న్నాయి. మరి మనుషులే యిలా రెక్కలు కట్టుకు ఎగిరిపోయేది !